

పరిశ్రమల స్థాపనపై ఔత్సాహికులకు అవగాహన

జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం రంగనాథ్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో పరిశ్రమల స్థాపనపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన అవసరమని జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం పి.వి.రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆర్ఎం ఎంపి పథకం ద్వారా రాష్ట్రంలో ఎంటర్ప్రెన్యూర్‌షిప్, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ (ఇఎన్‌డిపి) వర్క్‌షాప్‌లను జిల్లాలో మూడుచోట్ల నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంతో పాటు పారిశ్రామిక ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతున్న ఎచ్చెర్ల, పలాస కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ శిక్షణ తరగతులు నెల రోజుల పాటు నిర్వహించనున్నట్టు చెప్పారు. శిక్షణలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకోసం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి



శ్రీకాకుళం అర్బన్ : ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ డిమాండ్ చేశారు. నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద వామపక్ష పార్టీలు ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ముందుగా కూడలి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై అమిత్ షా అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ నిర్వహిస్తున్న సమయంలో అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. దేశానికి మతోన్మాదం ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు, సిపిఐ నాయకులు చాపర సుందర్‌లాల్, న్యూ డెమోక్రసీ నాయకులు సన్నశెట్టి రాజశేఖర్, ఎం.యుగంధర్, కె.శ్రీనివాస్, సిహెచ్.అమ్మన్నాయుడు, కోత్తకోట అప్పారావు, అల్లు సత్యం, కె.సూరయ్య, ఆర్.ప్రకాష్, చిక్కాల గోవిందరావు, పి.ప్రభావితి, సవలాపురం కృష్ణవేణి, ఎం.లలిత, ఎన్.వి.రమణ. ఎల్.మహేష్ పాల్గొన్నారు.

పలాస : కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని వామపక్ష నాయకులు కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామడ సన్యాసిరావు, సిపిఐ కార్యదర్శి చాపర వేణుగోపాల్, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు జుత్తు వీరాస్వామి, పిడియస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్ కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్.రవి, పివైఎల్ జిల్లా కన్వీనర్ సారా జగన్, రైతు కూలీ సంఘం నాయకులు రామారావు, పోతనపల్లి కామేశ్వరరావు, వంకల పాపయ్య, మామిడి భీమారావు, జడ్డే అప్పయ్య పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని దళిత, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక ఆదిఆంధ్ర వీధి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, ఉర్జాన ప్రసాద్, లక్ష్మణరావు, సిపిఎం నాయకులు బగాది వాసుదేవరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు, కెఎన్‌పిఎస్ నాయకులు బి.ప్రభాకర్, యువత యు.దుర్గాప్రసాదు, వెంకట్రావు, జోగి శంకర్, దాసరి అరుణ, దాసరి దేవీవరప్రసాద్ పాల్గొన్నారు.

పర్లాకిమిడి : కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలని గజపతి జిల్లా పర్లాకిమిడి కాలేజీ వద్ద వామపక్ష నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ముచ్చి బంగారయ్య, జిల్లా కమిటీ సభ్యులు దొండపాణి రైతో, దళిత సంఘటన నాయకులు గోకుల బెహరా, మహిళా సంఘం సభ్యులు రేణు, సుగుణ, సిపిఐ నాయకులు జొన్న సుభాష్, లింగరాజ్‌దొలై, శ్రీనుబెహరా, పైల మురళి పాల్గొన్నారు.



పలాస : ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు



టెక్కలి రూరల్ : ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటిష్టంగా అట్రాసిటీ చట్టాల అమలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పౌర హక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టం (పిసిఆర్, పిఒఎ యాక్టు)పై జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను సభ్యులు పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారం చూపాలన్నారు. అలాగే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులతో ఎచ్చెర్ల నియోజక వర్గంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రంలో జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శిక్షణా కేంద్రం నిర్మాణానికి న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారాన్ని కోరుతూ లేఖ రాశామన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ మాకివలసలో భూములు లేని ఎస్‌టి రైతులకు భూములివ్వాలని కోరారు. సమావేశంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్. వివేకానంద, సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వమోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు గేదెల రమణమూర్తి, కోట రాములు, తాలాబత్తుల ధనుంజయరావు, వివిఎస్ఎన్ రాజు, దాసరి తిరుమలరావు, బాలరాజు, దండాశి రాంబాబు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

'మీకోసం'లో 94 వినతులు స్వీకరణ



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం అర్బన్ : అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు సోమవారం అర్జీలు స్వీకరించారు. 94 అర్జీలు స్వీకరించగా, ఇందులో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సర్వే అండ్ లాండ్ రికార్డులు, ఎపి టౌన్షిప్, ఎపి హౌసింగ్, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్, ఎపిఇపిడిసియల్, పశుసంవర్ధకశాఖ, స్కిన్ డెవలప్‌మెంట్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, వికలాంగులు, గ్రామీణాభివృద్ధి, వాటర్ రిసోర్సెస్, మెడికల్ ఎడ్యుకేషన్, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ రూరల్ పవర్టీ, స్కూల్ ఎడ్యుకేషన్, ఎపి స్కిల్ డెవలప్‌మెంట్, మహిళా శిశు సంక్షేమశాఖ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, ట్రెజరీ, దేవదాయశాఖ, మైన్స్ అండ్ జియాలజిశాఖలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. నగరానికి ఆనుకుని ఉన్న శ్రీకాకుళం మండలం భైరివానిపేటకు చెందిన 4.80 ఎకరాలు ఆక్రమణకు గురైందని రైతులు వినతిపత్రం అందజేశారు. రైతుల పేరుతో సాగుహక్కు పత్రాలు ఇప్పించి వ్యాపారిపైతో పాటు రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పొన్నాన వెంకటరావు, కొర్ను సాయిరాం, శిమ్మ అప్పన్న, పాలవలస రామారావు కోరారు. నగరంలోని పాత వంతెన నిర్మాణం సమయంలో భవంతులు కోల్పోయినా ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదని హయాతీనగరానికి చెందిన డాక్టర్ నల్లాన గిరిబాబు కోరారు. జి.సిగడాం మండలం గొడ్డకంచరాంకు చెందిన దళితుల భూములు అన్యాక్రాంతమైనట్టు గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రజలకు ఎదురవుతున్న పలుసమస్యలతో కూడిన వినతులను వైసిపి నాయకులు చింతాడ రవికుమార్ అందజేశారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న మగ ఆరోగ్య కార్యకర్తలను అర్థాంతరంగా తొలగించడం వల్ల జిల్లాలో 110 మంది వరకు వీధిన పడ్డారని ఎపి హెల్త్ అసిసెంట్లు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బి.మురళి తదితరులు వివరించారు. ఇలా 94 వినతులను సమర్పించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, డిఆర్ఒ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు నిర్మించిన సివిల్, ఎపిఎస్‌పి పోలీసు కానిస్టేబుల్ (పురుషులు /మహిళాలు) ఉద్యోగాలకు ప్రిలిమినరీ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ఫిజికల్ మేజర్మెంట్ పరీక్ష, ఫిజికల్ ఎఫిషయన్స్ పరీక్షలను ఎచ్చెర్ల పెరేడ్ మైదానంలో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి సోమవారం ప్రారంభించారు. రోజూ దేహదారుఢ్య పరీక్షలు షెడ్యూలు మేరకు ఈ క్రమంలో ధ్రువపత్రాల పరిశీలన, బయోమెట్రిక్ ఆథెంటికేషన్, ఫిజికల్ మెజర్మెంట్ పరీక్షలు (ఛాతీ, ఎత్తు), ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు (1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్), వెరిఫికేషన్-2 (స్పెషల్ బెన్ఫిట్స్, లోకల్ స్టేటస్), రిజల్ట్ కౌంటర్ వరకు ప్రతి స్థాయిలో సమగ్రంగా పోలీస్ అధికారులు పారదర్శకంగా నిర్వహించారు. దేహదారుఢ్య పరీక్షలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సిసి కెమెరాలు పర్యవేక్షణలో పరీక్షలు పూర్తిస్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టారు. అభ్యర్థులు అవసరం మేరకు తాగు నీరు, వైద్య శిబిరాన్ని, అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు మైదానంలోకి ప్రవేశించిన మొదలుకుని, వారు దేహదారుఢ్య పరీక్షలు ముగించుకుని మైదానం నుంచి తిరిగి వెళ్లే వరకూ వారికి అర్థమయ్యే రీతిలో ప్రతి పరీక్షా అంశాన్ని సూచించే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. అభ్యర్థులతో ఎస్‌పి స్వయంగా మాట్లాడి ఎక్కడ ఎటువంటి ఆటంకం, లోపాలు లేకుండా ధ్రువపత్రాలను పరిశీలించారు.



పరుగు పందాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మాన్యువల్ స్కావెంజర్ వ్యవస్థకు స్వస్తి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాన్యువల్ స్కావెంజర్స్ చట్టం పకడ్బందీగా అమలు చేసేందుకు వీలుగా ఆ వ్యవస్థకు స్వస్తి పలకాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన మాన్యువల్ స్కావెంజర్స్ వ్యవస్థ నిర్మూలనపై మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, సంబంధిత అధికారులతో జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో మాన్యువల్ స్కావెంజర్స్‌గా ఉండేవారిని వెంటనే గుర్తించి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో సఫాయి కర్మచారులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిబంధనల ప్రకారం వారికి మాస్క్, గ్లౌజులు, బూట్లు, ఆయిల్, సోప్, హెల్మెట్, సేఫ్టీ ప్యాక్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, తదితర భద్రతా పరికరాలు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు.

వారి కుటుంబ సభ్యులకు వివిధ పథకాల కింద అర్హత కలిగిన వారికి రుణాలు ఇచ్చేందుకు మానవతా దృక్పథంతో ఆలోచించాలన్నారు. సమావేశంలో నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, సోషల్ వెల్ఫేర్ డిడి విశ్వమోహన్‌రెడ్డి, డిపిఒ భారతి సౌజన్య, శ్రీకాకుళం, టెక్కలి ఆర్‌డిఒ సాయిప్రత్యూష, కృష్ణమూర్తి, నగర కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, సభ్యులు ఎన్.బలరాం, టి.తిరుపతిరావు, వేణుగోపాల్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమికి ఘనంగా ఏర్పాట్లు

కలెక్టర స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర పండగగా ప్రకటించిన అరసవల్లి రథసప్తమి వేడుకలను జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకలు శోభాయాత్రతో ప్రారంభమై, సంప్రదాయ క్రీడలు, లేజర్ షో, బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేయనున్నాయని, లక్షలాది యాత్రికులను ఆకర్షించే ఈ వేడుకల కోసం శ్రీకాకుళం నగరాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలని నిర్ణయించారు. ప్రధాన కూడళ్లలో బ్యూటీఫికేషన్ కార్యక్రమాలు చేపట్టాలని, ఫౌంటెన్లు నిర్మించాలని సూచించారు. రథసప్తమి వేడుకలు జిల్లా ప్రతిష్టను పెంచుతాయని అన్నారు. ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించడానికి అన్నిశాఖల అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. లక్షలాది మంది యాత్రికులు వచ్చే అవకాశం ఉన్నందున పరిశుభ్రత, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సంప్రదాయ కళలు, క్రీడలను ప్రోత్సహించేలా కార్యక్రమాల నిర్వహణ ఉండాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం, టెక్కలి ఆర్‌డిఒలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, కమిషనర్ ప్రసాదరావు, అరసవెల్లి ఇఒ వై.భద్రాజీ, డిఎస్‌డిఒ శ్రీధర్, పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు పాల్గొన్నారు.




సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సిక్కోలుతో 'విజయా'నుబంధం

జిల్లా నుంచి సిఎస్‌గా మూడో కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె.విజయానంద్ ఇక్కడే కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన జూలై 15, 2002లో బాధ్యతల్లో చేరి ఏప్రిల్ 19, 2004 వరకు పనిచేశారు. జిల్లాలో పనిచేసిన కాలంలో విజయవంతంగా పనిచేశారన్న పేరును సొంతం చేసుకున్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సీపన్నాయుడుపేట వద్ద నిర్మించిన పార్కును ఆయన పేరుతోనే నిర్మించారు. కలెక్టర్‌గా సేవలందించి సిఎస్‌గా నియమితులు కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో కలెక్టర్లుగా పనిచేసి సిఎస్‌లైన వారి జాబితాలో విజయానంద్ మూడో ఐఎఎస్ అధికారిగా ఉన్నారు. అలాగే టిడిపి ప్రభుత్వ హయాంలో 2018, సెప్టెంబరు 29 సిఎస్‌గా నియమితులైన అనిల్ చంద్ర పునేఠా ఇక్కడ కలెక్టర్‌గా 1993 నుంచి 1996 వరకు పనిచేశారు. వైసిపి ప్రభుత్వ హయంలో 2022, నవంబరు 29న సిఎస్‌గా నియమితులైన కె.ఎస్. జవహర్‌రెడ్డి కూడా ఇక్కడ కలెక్టర్‌గా 1999 నుంచి 2002 వరకు పనిచేశారు. టెక్కలి సబ్‌కలెక్టర్‌గా సెప్టెంబరు 16, 1986 లో తొలి పోస్టింగ్ పొందిన నీలం సహానీ కూడా చీఫ్ సెక్రటరీ అయ్యారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నవంబరు 2019 నుంచి జనవరి 2021 వరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.



విజయానంద్

తీర్పు... మార్పు

ఓడలు బళ్లు అవుతాయి... బళ్లు ఓడలవుతాయనడానికి ఈ ఏడాది చోటు చేసుకున్న రాజకీయ పరిమాణాలే ఉదాహరణ. 2024 రాజకీయ పరిణామాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో టిడిపి కూటమి 164 సీట్లలో ఘన విజయం సాధించి పాలనా పగ్గాలు చేపట్టింది. జిల్లాలోనూ ఒక చరిత్ర సృష్టించింది. జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా ఎనిమిది సీట్లనూ కూటమి కైవసం చేసుకుంది. శ్రీకాకుళం ఎంపీ స్థానాన్ని తన ఖాతాలో వేసుకుంది. నగదు బదిలీ పథకాలు, వెల్ఫేర్ స్కీంలే తమను గెలిపిస్తాయని అతివిశ్వాసం కనబరిచిన వైసిపి ఘోర ఓటమిని మూటగట్టుకుంది. ఎన్నికల్లో తన రాజకీయ అవగాహనలో భాగంగా సిపిఎం కాంగ్రెస్‌తో అవగాహన కుదుర్చుకుంది.

- మారిన పాలనాధికారం పగ్గాలు
- సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి ఘన విజయం
- చతికిలబడిన వైసిపి
- ఉద్యమాలతో సిపిఎంకు ప్రజల్లో ఆదరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళంప్రతినిధి

2024 తొలి అర్ధభాగమంతా ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ ప్రక్రియ, ఫలితాలు, కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతోనే సాగింది. ఏప్రిల్‌లో నిర్వహించిన ఎన్నికలో శ్రీకాకుళం జిల్లాలోని ఎనిమిది స్థానాల్లో టిడిపి కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. ఏడు స్థానాల్లో టిడిపి గెలుపొందగా, ఎచ్చెర్ల స్థానంలో బిజెపి అభ్యర్థి ఎన్.ఈశ్వరరావు విజయం సాధించారు. శ్రీకాకుళం ఎంపీగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు మూడో సారి గెలిచి హాట్రిక్ సాధించారు. మళ్లీ అధికారం కైవసం చేసుకుంటామని ధీమాగా ఉన్న వైసిపికి సిక్కోలు ప్రజలు తేరుకోలేని షాక్ ఇచ్చారు. ఆ పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ పరాజయం పాలైంది. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వంటి రాజకీయ ఉద్దండులు సైతం ఎన్నికల్లో మట్టి కరిచారు.

తొలిసారి అసెంబ్లీలోకి ముగ్గురు ఎమ్మెల్యేలు

ఈసారి ఎన్నికల్లో జిల్లా నుంచి కొత్తగా ముగ్గురు ఎమ్మెల్యేలు విజయం సాధించి అసెంబ్లీలోకి అడుగు పెట్టారు. టిక్కెట్ల కేటాయింపులో భాగంగా శ్రీకాకుళం, పాతపట్నం స్థానాల్లో టిడిపి తన అభ్యర్థులను మార్చింది. శ్రీకాకుళంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికి బదులుగా గొండు శంకర్‌కు కేటాయించింది. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై భారీ ఆధిక్యంతో గెలుపొందారు. పాతపట్నంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణను మార్చి మామిడి గోవిందరావును అవకాశం ఇచ్చింది. ఆయనా ఆ స్థానం నుంచి గెలుపొందారు. పలాస నియోజకవర్గం నుంచి గౌతు శిరీష రెండో సారి టిడిపి అవకాశం కల్పించింది. ఆ స్థానం నుంచి ఆమె తొలిసారి విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు.



కేంద్ర, రాష్ట్ర కేబినెట్‌లో ఇద్దరికి చోటు

కేంద్ర ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా ఉండడటం, అక్కడ ఎన్‌డిఎ అధికారంలోకి రావడంతో టిడిపి కోటాలో పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేబినెట్ మంత్రి అయ్యారు. రాష్ట్ర కేబినెట్‌లో జిల్లాకు చెందిన వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు చోటు దక్కింది.

వైసిపిని వీడని నిరాశ, నిస్పృహలు

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు కావొస్తున్నా వైసిపిని ఇంకా పరాజయ నిస్పృహాలు వీడటం లేదు. పార్టీ ఇస్తున్న పిలుపులకు నాయకులు పెద్దగా స్పందించడం లేదు. ధాన్యానికి మద్దతు ధర, రైతాంగ సమస్యలపై వైసిపి అధిష్టానం ఇచ్చిన పిలుపునకు జిల్లా నాయకత్వం అంతంత మాత్రంగానే జన సమీకరణ చేసింది. విద్యుత్ భారాలపై చేపట్టిన ఆందోళనలకు పార్టీ నాయకత్వం స్పందన బాగానే ఉన్నా... ముఖ్యంగా నాయకులు ప్రజలకు ముఖం చూపించడానికి ఇష్టపడటం లేదు. ప్రధానంగా జిల్లాలో పార్టీకి పెద్ద దిక్కుగా కార్యకర్తలు చెప్పుకునే మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఇంకా ఓటమి మనస్థాపం వీడటం లేదు.

బిజెపికి సీటు...టిడిపికి చేటు

కూటమి పార్టీల మధ్య పొత్తులో భాగంగా ఎచ్చెర్ల సీటును టిడిపి తన మిత్రపక్షం బిజెపికి కేటాయించింది. ఆ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా గెలుపొందిన ఎన్.ఈశ్వరరావు విజయం సాధించడంతో జిల్లాలో తొలిసారి ఒక సీటు బిజెపి ఖాతాలో చేరినట్లయింది. ఇక్కడ నుంచి 2014, 2019 ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యే కళా వెంకటరావుకు పార్టీ అధిష్టానం చీపురుపల్లి టిక్కెట్ కేటాయించడంతో అక్కడ నుంచి పోటీ చేసి గెలుపొందారు. టిడిపి ఇప్పటివరకు ఇన్‌ఛార్జిని నియమించుకోలేకపోవడం ఆ పార్టీకి లోపంగా మారింది. తమ కష్టాలు, సమస్యలను వినేవారు లేక కేడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొంది

ప్రజా సమస్యలపై సిపిఎం ఉద్యమాలు

అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై మాట్లాడటం మానేసి తన ఖజానాను నింపుకోవడంపై దృష్టి సారించింది. ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో విపరీతంగా విద్యుత్ ఛార్జీలను పెంచింది. డిసెంబరులో జారీ చేసిన విద్యుత్ బిల్లులు చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ... ఉద్యమాన్ని చేపట్టింది. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. నాలుగోసారి సిఎం పదవి చేపట్టిన చంద్రబాబు తన మార్క్ పాలన ప్రారంభించారు. పరిశ్రమలు, ఎయిర్‌పోర్టు నిర్మాణం పేరుతో కార్పొరేట్లకు భూములను అప్పగించే పనికి స్వీకారం చుట్టారు. మందసలో కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో సుమారు 1400 ఎకరాలను రైతుల నుంచి తీసుకునేందుకు సర్వే చేపట్టింది. కొబ్బరి, జీడి, మామిడి తోటలపై బతుకుతున్న నిరుపేద రైతులు, స్థానిక ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజల్లో వ్యతిరేక వ్యక్తమవుతున్న నేపథ్యంలో సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలు వారికి అండగా నిలవాలని నిర్ణయించాయి. గ్రామాల్లో పర్యటించి వారికి భరోసా నిచ్చాయి. ఎన్నికలప్పుడే రాజకీయాలు, ఎన్నికల తర్వాత ప్రజా సమస్యలే తమ అజెండా అంటూ సిపిఎం సాగిస్తున్న ఆందోళనకు ప్రజల

ఇవిఎం గోదాముల పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కలెక్టరేట్‌లోని ఇవిఎం యంత్రాలు, వివి ప్యాట్లు భద్రపరిచే గోడౌన్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. గోడౌన్‌కు వేసిన సీళ్లను ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ప్రతి త్రైమాషికంలో ఇవిఎం, వివి ప్యాట్ గోడౌన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, టిడిపి పార్టీ నుంచి కె.వి.రామరాజు, కాంగ్రెస్ నుంచి కెవిఎల్ఎస్.ఈశ్వరి, బిఎస్‌పి నుంచి లాసా సోమేశ్వరరావు, సిపిఎం నుంచి మాతల గోవర్ధనరావు, వైసిపి నుంచి రౌతు శంకరరావు, సి-సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.




పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి
www.prajasakti.com

లైఫ్ సర్టిఫికెట్ ఇస్తేనే పెన్షన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు కొత్త సంవత్సరంలో జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఎన్ఐసి జీవన్ ప్రమాణ్‌లో ఆన్‌లైన్ సిఎఫ్ఎంఎస్ లాగిన్‌లో సబ్మిట్ చేయాలని, ఫిబ్రవరి 28లోగా సబ్మిట్ చేసిన వారికే పెన్షన్ చెల్లించడం జరుగుతుందని జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు రాష్ట్రంలో ఏప్రాంతంలో ఉన్నా సమీప ట్రెజరీలో అందజేయాలన్నారు. సకాలంలో అందజేయని పక్షంలో ఏప్రిల్ నెల పెన్షన్ విడుదల సాధ్యం కాదన్నారు. అలాగే పెన్షనర్‌కు ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే అందులో ఎన్ఐసి జీవన్ ప్రమాణ యాప్, ఆధార్ ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుని ఇంటి వద్దనే లైఫ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేసుకోవచ్చన్నారు. ఉద్యోగం చేస్తూ పెన్షన్ పొందుతున్న వారు, జిఒ 315 ప్రకారం పింఛను పొందుతున్న అవివాహిత, వితంతువు, మైనర్ పెన్షన్, మళ్లీ వివాహం చేసుకున్న వారు నేరుగా సంబంధిత సబ్ ట్రెజరీలో సంప్రదించి లైఫ్ సర్టిఫికెట్లతో పాటు ఇతర సర్టిఫికెట్లు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ మార్పును పెన్షన్‌దారులు గమనించాలని ఆయన సూచించారు.


ధ్రువపత్రాలను అందజేస్తున్న మధుసూదనరావు

అవకాశాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

కళాశాల స్థాయి నుంచి విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా వారికి శిక్షణ అందించడం ఆహ్వానించదగిన పరిణామమని స్థానిక మండల అధికారి బి.మధుసూదనరావు అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్ప్రన్యూర్ షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్మెంట్ (నీస్బడ్) నిర్వహించిన వారం రోజుల శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసి వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కళాశాలలు తీసుకోవాలన్నారు. స్టార్టప్ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫార్మా అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ రంగాలను కళాశాలలతో అనుసంధానం చేయడం ద్వారా సమాజానికి అవసరమైన అనేక ఆవిష్కరణలను విద్యార్థుల ద్వారా వెలికి తీసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ కె.నాగమణి, వ్యవసాయ అధికారి కె.సునీత, కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్, అకడమిక్ ఇన్‌ఛార్జి ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు కె.రాము, జీవన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి కడియాల పద్మ

రూ.6.72 లక్షల మిగులుతో బడ్జెట్

ప్రజాశక్తి- కవిటి

మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి సంబంధించి వివిధ పద్దులు కింద ఆదాయం, వ్యయం 2025-26 ఏడాది అంచనా బడ్జెట్ రూ.26,850,000 కోట్లకు రూ.6.72 లక్షల మిగులుతో ఆమోదించారు. ఎంపిపి కడియాల పద్మ అధ్యక్షతన సోమవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2024-25 ఏడాదికి సంబంధించి రూ.23,771,000 కోట్ల బడ్జెట్‌లో రూ.23,171,000 వ్యయం కాగా, రూ.6 లక్షలు మిగులు చూపించారు. అదే 2025-26 ఏడాదికి రూ.26,850,000 కోట్ల బడ్జెట్‌లో రూ.26,178,000 కోట్లు వ్యయంగా అంచనా వేసి రూ.6,72 లక్షలు మిగులుగా చూపించారు. ఈ బడ్జెట్‌ను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, మండలంలోని ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన విధానాలను అవలంబించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థులు, రైతులు నూతన ఆక్వాకల్చర్ విధానాలను అవగాహన చేసుకొని వాతావరణంలో వచ్చే మార్పులు, వ్యాధులను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టడంలో అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె. భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి సౌజన్యంతో మత్స్యశాస్త్రం విద్యార్థులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్.బాలకృష్ణ మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పద్ధతులను విడిచి సాంద్ర పద్ధతుల్లో చేపల సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించ వచ్చునన్నారు. అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక పద్ధతులను విద్యార్థులకు వివరించారు. క్షేత్రస్థాయిలో వినూత్న చేపల పెంపక విధానాలైన హర్ష ఆక్వాకల్చర్ యూనిట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు, అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, రమణమూర్తి పాల్గొన్నారు.


చేపల పెంపకం యూనిట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

మందుబాబులకు అడ్డాగా...

- పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు
- ప్రహరీ లేక ఇబ్బందులు


జెడ్‌పి పాఠశాల

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరులో ఉన్న లావేరు జెడ్‌పి పాఠశాలకు చుట్టూ ప్రహరీగోడ లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. సుమారు 4 ఎకరాల్లో సువిశాలమైన విస్తర్ణంలో పాఠశాల భవనాలతో పాటు మైదానం ఉంది. అయితే వీటి చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో పాఠశాల పనివేళలు ముగింపు అయిన తరువాత చీకటిపడితే చాలు ఆ పరిసరాల్లో తాగుబోతులు, అసాంఘిక కార్యకలాపాలతో నిండిపోతుంది. పవిత్రమైన పాఠశాల ప్రాంగణంలో ఇటువంటి చీకటి కార్యకలాపాలు జరుగుతుండటంతో విద్యార్థులు. విజ్ఞానవంతులు ఈ దుస్థితిని చూసి ఆవేదన చెందుతున్నారు. ఈ పాఠశాల స్థాపించి 50 ఏళ్లు పైబడుతుంది. ఎంతో మందిని విజ్ఞాన వంతులను చేసింది. ఇక్కడ చదివిన వారు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నా పాఠశాల దుస్థితి మారలేదు. బహిరంగ మల విసర్జనను కూడా పాఠశాల క్రీడా మైదానంలో చేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పాఠశాల మైదానంలో కొంతమంది వస్త్రపూరి కాలనీ వాసులు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడంతో ఆలస్యంగా తెలుసుకున్న రెవెన్యూ, విద్యాశాఖాధికారులు ఆలయ అక్రమ కట్టడాలను అడ్డుకున్నారు. చట్టవ్యతిరేకమైన పనులు చేపడితే అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో పనులను నిలుపుదల చేశారు. ఇటువంటి కార్యక్రమాలకు అడ్డుకట్టు వేసేందుకు ప్రభుత్వం పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని, దానికి అనుగుణంగా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేసి ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.


ప్రహరీ లేని పాఠశాల మైదానం

ఆరుబయట వంటలు

పాఠశాలలో 5 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్నారు. ఇక్కడ వంట చేసేందుకు వంట షెడ్ లేకపోవడంతో వంట కార్మికులు ఆరుబయట వంటలు చేయాల్సి వస్తుంది. వర్షం, ఎండల్లోనే వంట చేస్తున్నారు. వర్షం వస్తే వంటలు చేసేందుకు వంట కార్మికులకు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వంట షెడ్ మంజూరు చేయాలని వంట కార్మికులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

2న ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని వావిలపల్లిపేటలో ఉన్న ఎపి మోడల్ స్కూల్ వసతిగృహంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టుకు జనవరి 2వ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంఇఒ-1 రాజేంద్రప్రసాద్ తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు విధిగా హాజకావాలన్నారు.

4న టాలెంట్ టెస్టు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో గల సైన్సు విద్యార్థుల్లో బయాలజికల్ సైన్సుపై ఆసక్తి పెంచడానికి జిల్లా విద్యాశాఖాధికారి అనుమతితో జనవరి 4న బయాలజీ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ఎపి బిఎస్‌టిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుట్టా ఉదయ్‌కుమార్, పూజారి గోవిందరావు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి పరీక్ష ఉంటుందని, ప్రతి పాఠశాల నుంచి 8, 9, 10 చదువుతున్న ఒక్కో విద్యార్థికి మాత్రమే ఈ పరీక్షకు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ టెస్ట్‌లో ప్రభుత్వ యాజమాన్యాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి పాల్గొనాలని వారు సూచించారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు

కోటబొమ్మాళి: డిసెంబరు 31 రాత్రి అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ వై.సత్యనారాయణ హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. తాగిన మైకంలో అత్యుత్సాహం ప్రదర్శించరాదని, ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా వేడుకలు నిర్వహించాలని అన్నారు. పూర్తి స్థాయిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసి అధిక శబ్దాలతో రోడ్లపైకి వచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

బిసిలకు సముచిత స్థానం

ప్రజాశక్తి- పాతపట్నం

రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా బిసి తరగతికి చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి కె.విజయానంద్‌ను సిఎం చంద్రబాబు నియమించి సముచిత స్థానం కల్పిచారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరులతో మాట్లాడారు. తొలిసారి బిసికి చెందిన వ్యక్తిని సిఎస్‌గా నియమించడంపై సంతోషం వ్యక్తం చేశారు. విజయానంద్ శ్రీకాకుళం కలెక్టర్‌గా పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు.

జీవశాస్త్ర దృక్పథం పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం అర్బన్: శాస్త్ర సాంకేతిక, వైజ్ఞానిక రంగాల్లో పరిశోధనలు ఎంతో అవసరమని కేంద్ర పౌర విమానాయన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. అంతర్జాతీయ సమకాలిన పరిశోధన, జీవశాస్త్ర దృక్పథం అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే గొండుశంకర్‌తో కలిసి ఆవిష్కరించారు. భీమిలి గోస్తాని ఉప్పు, మంచినీటి అలలు పరిధిలో ఉన్న చేపజాతుల వైవిధ్యంపై 18 నెలల పాటు పరిశోధించి 60 చేప జాతులను గుర్తించిన శాస్త్రవేత్తను ఆయన అభినందించారు. పరిశోధనల్లో పెర్చ్ జాతికి చెందినవి అధిక సంఖ్యలోను, ఆక్వా జాతి రకాలు తక్కువగా ఉన్నట్టు గుర్తించినట్లు పరిశోధకులు పుస్తకంలో పొందుపర్చారు. పుస్తక రచయితలు డా.కర్రి రామారావు, వెలమల హారతి, డా.రామచంద్రరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు.

38 వినతుల స్వీకరణ

శ్రీకాకుళం: జిల్లా ఎస్‌పి కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదులను పట్టణ డిఎస్‌పి సిహెచ్.వివేకానంద్ స్వీకరించారు. ఈ ప్రజా ఫిర్యాదుకు 38 వినతులు వచ్చాయి. అనంతరం ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లో తెలియజేశారు. చట్టప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. ప్రజా ఫిర్యాదులపై ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలన్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

రోడ్ల అబివృద్ధిపై దృష్టిసారించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పంచాయతీరాజ్‌శాఖ నుంచి నిధులను మంజూరు చేసిందని తెలిపారు. ఈ మేరకు కత్తిరివానిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో డిఇ సత్యనారాయణ, ఎఇలు మోహన్, బగ్గు నర్సింగరావు, కె.శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

పోలాకి: సంపూర్ణ వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. స్థానిక పప్పుల వీధి చెందిన వసంత కుమారి కేన్సర్‌తో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రూ.86,936 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలగ ప్రహర్ష, ఎంపిటిసి మాజీ సభ్యులు కింజరాపు చిన్నవాడు, బతకల సంతోషి, గోపి, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు సిద్ధం చేయాలి

ఎమ్మెల్యే గౌతు శిరీష


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ రైల్వే గేటు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. గతంలో ఇళ్ల స్థలాలు కేటాయించిన కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో భూములను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నిర్వాసితుడికీ ఇళ్ల స్థలం మంజూరు చేయాలన్నారు. బ్రిడ్జి నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇప్పటికే అందజేశామన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న వారికీ త్వరలోనే నష్టపరిహారం ఇస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణం ఆలస్యమైందని, పట్టాలు ఇచ్చిన తరువాత ఆ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. నిర్వాసితులు ఎంతమంది ఉన్నారని తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. సూదికొండ ప్రాంతంలో గతంలో రెండు ఎకరాల స్థలాన్ని నిర్వాసితుల కోసం కేటాయించామని, అందులో కొంతమంది ఆక్రమణలకు పాల్పడి గృహాలు నిర్మించారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న స్థలం మేరకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. అనంతరం శ్మశానానికి కేటాయించిన స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, జోగ మల్లి, ఎ.రామకృష్ణ, చంద్రశేఖర్ త్యాడి, సర్వేయర్ వి.గిరి, నాయకులు పాల్గొన్నారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

పొందూరు: మండలం తోలాపిలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం స్థానిక టిడిపి నాయకులు ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున పార్టీ సభ్యత్వం రెన్యువల్‌తో పాటు నూతన సభ్యత్వ నమోదును జరిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుంపల సత్యం, మాజీ ఎంపిటిసి పొన్నాడ అప్పారావు, పి.అప్పలనాయుడు, ఉప సర్పంచ్ శ్రీని వాసరావు, గంగాధర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పొందూరు : సభ్యత్వ నమోదులో నాయకులు

మెళియాపుట్టి: టిడిపి సభ్యత్వం ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని మాజీ ఎంపిపి ఎన్.మోహనరావు, టిడిపి మండల నాయకుడు బొచ్చు ప్రసాదరావు అన్నారు. మండలంలోని కొసమాలలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ సభ్యత్వానికి టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ ఆనాడే బీజం వేశారని తెలిపారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు వెళ్తున్నారని అన్నారు. రూ.వంద సభ్యత్వ నమోదు చేసుకుంటే రూ.5 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. సోనాపురం సుబ్బారావు, సిరిపురం వెంకటరావు, సుందరరావు, సింహాచలం, ధర్మారావు పాల్గొన్నారు.


మెళియాపుట్టి : సభ్యత్వాలు నమోదు చేస్తున్న నాయకులు

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

ప్రజాశక్తి- నరసన్నపేట

బ్యాంకు లావాదేవీలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ చెల్లింపులపై అవగాహన కలిగి ఉండాలని నరసన్నపేట ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ డి.మధుసూదనరావు తెలిపారు. వ్యక్తిగత సమాచారం, ఒటిపి, ఆధార్ నంబర్ల కోసం బ్యాంకు అధికారుల నుంచి ఎలాంటి ఫోన్ కాల్స్ రావనీ గుర్తించాలన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకౌంటింగ్ అండ్ టేక్సేషన్ విద్యనభ్యసిస్తోన్న విద్యార్థులకు ఆన్ ది జాబ్ శిక్షణలో భాగంగా బ్యాంకు లావాదేవీలపై బ్యాంకులోనే సోమవారం అవగాహన కల్పించారు. వృత్తి విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులకు నెలరోజుల పాటు వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిజ్ఞానం పొందేలా డివిఇఒ శివ్వాల తవిటినాయుడు ఆదేశాలతో ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ సూచనల మేరకు శిక్షణ ఇస్తున్నామని అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో వస్తోన్న మార్పులు, డిజిటల్ బ్యాంకింగ్, వివిధ రకాల దరఖాస్తులు నింపడం, డిపాజిట్, డబ్బులు బట్వాడా చేయడం, నెఫ్ట్, ఆర్‌టిజిఎస్ ద్వారా నగదు బదిలీ చేయడం వంటి అంశాలపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సందేహాలను చీఫ్ మేనేజర్ నివృత్తి చేశారు.


అవగాహన కల్పిస్తున్న మధుసూదనరావు

దిగబడిన లారీలు

ట్రాఫిక్‌కు అంతరాయం


గోతిలో దిగబడిన లారీ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని చీడివలస గ్రామ సమీపంలో గుత్తావల్లి రహదారి పక్కన గోతిలో సోమవారం నారాయణపురం నాగావళి నది నుంచి ఇసుక లోడుతో వెళ్తున్న లారీలు దిగబడిపోయాయి. దీంతో ఉదయం నుంచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ రహదారిపై ప్రతిరోజు సంతకవిటి, రాజాం మండలాల నుంచి శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రాలకు వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. సుమారు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా నారాయణపురం గ్రామం వద్ద వంతెన కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

ఆకలి తీర్చే సూర్యుడు

ప్రజాశక్తి- రణస్థలం

ఆయన ఆర్థికంగా శ్రీమంతుడు కాదు. తాతలు.. తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులేమీ లేవు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. సామాన్య కుటుంబంలో జన్మించి, తన స్వశక్తితో వ్యాపారం చేసుకొని ఆర్థికంగా ఎంతో కొంత అభివృద్ధి సాధించాడు. అలా వచ్చిన దనంతో రోజూ కొంతమందికి పట్టెడు అన్నం పెడుతున్నాడు. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఏడాదిగా అన్నదానం చేస్తున్నాడు. ఆయనే రణస్థలం మండలం పాతర్లపల్లి గ్రామానికి చెందిన గొర్లె సూర్య. తల్లిదండ్రులు ఇద్దరూ రైతు కూలీలే, ఆయనకు జనసేనాని పవన్ కళ్యాణ్ అంటే వీరాభిమానం. పేదలకు పట్టెడు అన్నం పెట్టాలని పవన్ కళ్యాణ్ తరచూ చెబుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా డొక్కా సీతమ్మ పేరిట పేద ప్రజల కడుపు నింపాలని పిలుపునిచ్చారు. ఆ పిలుపునకు స్పందించాడు సూర్య. స్వతహాగా కొబ్బరి కాయల వ్యాపారం చేసే సూర్య అందులో వచ్చిన కొంత మొత్తాన్ని పేదల కోసం వినియోగిస్తున్నాడు. రణస్థలం మండల కేంద్రం రామతీర్థం జంక్షన్ వద్ద డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరం పేరిట ప్రతిరోజూ అన్నదానం చేస్తుంటాడు. నిత్యం పదుల సంఖ్యలో అన్నార్తులు అక్కడ భోజనం చేస్తుంటారు. దీనికిగాను సూర్య ఎవరి దగ్గరా విరాళాలు ఆశించలేదు. తన శక్తి ఉన్నంత మేరకు పేదవారి కడుపు నింపాలన్నదే ఆశయంగా చెబుతున్నాడు. అనేక మంది కూటమి, జనసేన నాయకులు ఈ కార్యక్రమాన్ని కొనసాగించే విధంగా ప్రోత్సహిస్తున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. డిప్యూటీ సిఎం పవన్ పిలుపుతో ఏడాదిగా ఈ అన్నదాన ఉద్యమం చేస్తున్నట్లు చెబుతున్నాడు. ఇందులో తనకు ఎంతో సంతృప్తి లభిస్తోందని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతానని, ఆకలితో వచ్చిన వారికి పట్టెడన్నం పెట్టడంలో ఉన్న సంతోషం మరి దేనిలోనూ లేదని సూర్య అంటున్నాడు.



అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్న సూర్య


అన్నదాన కార్యక్రమంలో ఎంపీ అప్పలనాయుడు

అన్నదానానికి 365 రోజులు

మండల కేంద్రంలో సూర్య నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ ఉచిత అన్నదాన కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ సూర్యను అభినందించి మాట్లాడుతూ భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని, పేదలు, కూలీలు, ఇతరుల ఆకలి తీర్చడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అలాగే సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దృష్టికి ఈ కార్యక్రమాన్ని తీసుకువెళ్తానన్నారు.

క్రైమ్ కార్నర్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పబ్జి డాబా సమీపంలో సోమవారం విద్యుదాఘాతానికి గురై కంచిలి మండలం బాసుబంజరికి చెందిన బొండాడ రామారావు (45) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామారావు మేకలు మేపుతూ చెట్టుకొమ్మలు కోసి వేసేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో విద్యుత్ వైర్లకు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న బారువ ఎస్ఐ హరిప్రసాద్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువకునిపై దాడి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని పారాపురానికి చెందిన దుక్క సాయికుమార్‌పై అదే గ్రామానికి చెందిన జంపు జీవన్ దాడి చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ తెలిపారు. ఆదివారం గ్రామానికి చెందిన పైల శ్రీను పుట్టినరోజు వేడుకల్లో తనపై స్ప్రే చేయొద్దని వారించినా స్ప్రే చేయడంతో కోపగించుకున్న జీవన్ మనసులో పెట్టుకొని సోమవారం సాయికుమార్‌ను పిలిపించి ఇరువురు మధ్య మాటమాట పెరిగి కొట్లాటకు దారి తీయగా సాయికుమార్‌ను తాళం చెవితో గాయపరిచాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


పట్టుకున్న నాటుసారా ప్యాకెట్లతో ఎస్ఐ

సారా ప్యాకెట్లు పట్టివేత

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని మాతల పంచాయతీ పెనుగోటి వాడకు చెందిన కుర్మాన రాజకుమార్ 25 నాటుసారా ప్యాకెట్లను ఒడిషా రాష్ట్రం నుంచి ఆంధ్రాకు సోమవారం తరలిస్తుండగా మాతల వద్ద ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ దాడిచేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


నిందితులను అరెస్టు చేసిన సిఐ చిన్నంనాయుడు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ఇచ్ఛాపురం : ఒడిశా నుంచి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రూరల్ పోలీసులు అరెస్టు చేసినట్లు సిఐ మీసాల చిన్నంనాయడు తెలిపారు. ఈ మేరకు వారిని విలేకరుల ముందు సోమవారం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుపి రాష్ట్రానికి చెందిన అజయ్, అజయ్‌లు ఒడిశా రాష్ట్రం బడగడ నుంచి 11.43 కేజీలు గంజాయిని తరలిస్తున్నారని అన్నారు. మండలంలోని మండపల్లితోటూరు ఎలొసి గేట్ వద్ద తనిఖీ చేపట్టగా గంజాయి దొరికిందని అన్నారు. వారిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై నిఘా పెట్టామని అన్నారు.

పశువుల పట్టివేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

అక్రమంగా కబేళాకు తరలిస్తున్న మూడు పశువుల వాహనాలను పట్టుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం రాత్రి జలుమూరు మండలం నుంచి విజయనగరం జిల్లా అలమండ ప్రాంతానికి మూడు వాహనాల్లో అక్రమంగా పశువులు తరలిస్తున్నట్లు సమాచారం మేరకు అర్ధరాత్రి సమయంలో పశువులతో వస్తున్న మూడు వాహనాలను ఆపి అందులో ఉన్న వ్యక్తులను విచారించగా సరైన సమాధానం రాకపోవడంతో మూడు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఇన్‌ఛార్జి ఎస్ఐ ఎస్.బాలరాజు కేసునమోదు చేశారు. అక్రమంగా తరలిస్తున్న 21 గోవులను టెక్కలిలో ఉన్న గోశాలకు తరలించి ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.


దగ్ధమవుతున్న చెరుకు తోట

చెరుకు తోట దగ్ధం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని నీలంపేట గ్రామ సమీపంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో చెరుకుతోట దగ్ధమైంది. వావాం గ్రామానికి చెందిన గొలివి సూరపు నాయుడుకు చెందిన ఎకరా 20 సెంట్లు చెరుకుతోట ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురికావడంతో చెరుకు పంట అగ్నికి ఆహుతైంది. ప్రమాద సమాచారం తెలుసుకున్న పాలకొండ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది శకటంతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్షా 20 వేలు నష్టం ఉంటుందని అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ వెచ్చ సంతోష్‌కుమార్ అన్నారు. యువసూర్య ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్, న్యాయవాది రాంబాబు ఆధ్వర్యాన స్థానిక ఆదిత్య కాలేజ్ విద్యార్థులకు మాదక ద్రవ్యులు, సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులు మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఆదిత్య కాలేజ్ యాజమాన్యం రాజేంద్రబాబు, రమణ, శేఖర్, కామేష్, చిన్ని భైరి, ధర్మరాజు పాల్గొన్నారు.



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అప్పారావు

మాలల సమస్యలపై స్పందించాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

జిల్లాలో మాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలని రాష్ట్ర మాలల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్ కుమార్‌ను మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోసెల అప్పారావు కోరారు. సోమవారం అమరావతిలో మాలల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో మాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ జిల్లాలో మాలలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని భవిష్యత్‌లో మాలల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. చైర్మన్, డైరెక్టర్లు అందరూ సహకరించి ఉత్తరాంధ్ర మాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు ప్రవేశపెట్టి సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో మాలల కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

బాధితులకు అండగా ఉంటా..

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఫాతిమా బేగం కుటుంబ సభ్యులను అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రజక్ కుటుంబ సభ్యులు అందజేసిన రూ.10వేలు సాయాన్ని ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కష్టం వస్తే పార్టీ తరఫున సాయం చేసేందుకు ముందుకు వచ్చిన రజక్‌ను ప్రశంసించారు. పార్టీపై అంకిత భావం, చిత్తశుద్ధితో పనిచేసే వారికి ఉన్నత పదవులు లభిస్తాయన్నారు. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన ఫాతిమా కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రజక్ కుటుంబ సభ్యులు ఎండి రఫీ, టిడిపి మైనార్టీ నాయకులు షేక్ నిజాముద్దీన్, బహదూర్ భాష, మహమ్మద్ రఫీ, రెడ్డి గిరిజ శంకర్, ఎండు చిన్నారావు, పంచిరెడ్డి అప్పలనాయుడు, ముద్దాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

చదువుతోపాటు క్రీడలు అవసరం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

విద్యార్థుల జీవితంలో చదువుతోపాటు క్రీడలు అంతర్భాగం కావాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని గోవిందాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన సోమవారం నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో ఆసక్తి ఉన్నవారు అంతర్జాతీయ స్థాయిలో మెరిసేందుకు మన విశాఖపట్నానికి చెందిన క్రికెటర్ నితీష్ రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పాఠశాల హెచ్ఎం కె.హరిబాబు అధ్యక్షతన నిర్వహించిన ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జి బాబూరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు కర్ని రమణ, మాజీ ఎంపిపి బి.వసంతరావు, సూరాడ మోహనరావు, కోణారి కిరణ్, అప్పోజి, అఖిల్, చింత నారాయణ, మదానాల జోగారావు, గోవింద పాపారావు, పీడీలు ఎస్.నాగరాజు, తవిటయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పింఛన్ల కోసం నాలుగు, తాగునీటి సరఫరాకు నాలుగు, పారిశుధ్యంపై ఎనిమిది వినతులు అందాయని అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించామని తెలిపారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ జోగారావు

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - లావేరు

రైతులు భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతులు, ప్రజల నుంచి భూ సమస్యలపై వినతులు స్వీకరించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేసిన భూ రీసర్వేలో జరిగిన పొరపాట్లును సదస్సుల్లో పరిష్కరించుకోవాలన్నారు. 55 ధరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బళ్లాడ శ్రీధర్ రెడ్డి, డిటి ఎం.తిరుపతిరావు, ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, విఆర్ఒ వేణుగోపాల్, టిడిపి నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు, ఎల్.బాబు, రాజేష్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 18వ బ్యాచ్ డ్రైవర్లకు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయకుమార్ సోమవారం సర్టిఫికెట్‌ను అందజేశారు. ఆర్‌టిసి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న ప్రతిఒక్కరూ భవిష్యత్‌లో మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలన్నారు. ఆర్‌టిసిలో డ్రైవింగ్ శిక్షణ పొందిన వారికి అనేక రకాలైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే డ్రైవింగ్ అనుభవం ఉండి లైట్‌వెహికిల్ లైసెన్సు ఉన్న వారు 19వ బ్యాచ్‌లో శిక్షణలో చేర్చడానికి దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. 40 రోజుల పాటు శిక్షణ పొందిన వారికి అనేక రకాలైన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. శిక్షణతో పాటు మెకానికల్ వర్క్, యోగ, వ్యక్తిత్వ వికాసం, ట్రాఫిక్, రోడ్డు ట్రాఫిక్ రూల్స్‌పై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలన్నారు.

కొత్త శాస్త్రవేత్తలకు వైజ్ఞానిక ప్రదర్శనలు నాంది



టెక్కలి : విద్యార్థులు ప్రదర్శిస్తున్న ప్రాజెక్టులు

ప్రజాశక్తి - కవిటి

విజ్ఞానం... కొత్త ఆలోచనలు పరిశోధనలతో భవిష్యత్ శాస్త్రవేత్తలను తీర్చిదిద్దే వేదిక వైజ్ఞానిక ప్రదర్శన అని ఎంఇఒలు ధనుంజయ మజ్జి, చిట్టిబాబు అన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో మండలంలోని 16 గ్రూపులు, వ్యక్తిగతంగా 15 మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల విభాగంలో ఐదు ప్రాజెక్టులు పోటీ పడ్డాయి. వీరిలో మండలస్థాయి విజేతలుగా విద్యార్థి వ్యక్తిగతం విభాగంలో రాజపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి డిల్లీశ్వరి, గ్రూప్ విభాగంలో ముత్యాలపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మురహరి, సిద్దార్థ, ఉపాధ్యాయుల విభాగంలో కొత్త కొజ్జిరియా ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు త్రివేణి మొదటి బహుమతులు సాధించారు. ఈ ప్రదర్శనలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెండాళం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో వ్యక్తిగత విభాగంలో నౌగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రూపు విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్సిపురంలో ప్రదర్శన ప్రతిభ కనపరిచారు. ఉపాధ్యాయుల విభాగంలో అతికొన్నపురం ఉపాధ్యాయులు ఎస్.గోవిందరాజు, ఫిజిక్స్ విభాగంలో ఎం.భారతీలు ప్రదర్శించారు. ఎంఇఒ జి.నరసింహులు, ప్రధానోపాధ్యాయులు హరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల మేధోశక్తికి, అభివృద్ధికి తోడ్పడతాయని ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలు నిర్వహించిన మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకించారు. ఈ పోటీల్లో వ్యక్తిగత కేటగిరిలో గెలుపొందిన మండలం లఖందిడ్డి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు, బృంద కేటగిరిలో జర్జంగి పాఠశాలకు చెందిన విద్యార్థులు, టీచర్ కేటగిరిలో కురుడు పాఠశాలకు చెందిన విద్యార్థులు విజయం సాధించారు. పోటీలకు స్థానిక జూనియర్ కళాశాల అధ్యాపకులు ఎం.సోమేశ్వరరావు, వై మాధవిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయులు డి.గోవిందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతపట్నం: స్థానిక ఆదర్శ పాఠశాల పాతపట్నంలో ప్రిన్సిపాల్ రత్నకుమారి అధ్యక్షతన మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని సుమారు 13 ప్రభుత్వ పాఠశాలల నుంచి 30 సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శనలో పాల్గొన్నాయి. జిల్లాస్థాయి సైన్స్ అధికారి కుమారుస్వామి జ్యూరీగా వ్యవహరించారు. ఉపాధ్యాయ విభాగంలో పాతపట్నం ప్రభుత్వ హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఎన్ తారక రామారావు ప్రదర్శించిన ప్లాస్టిక్ కలెక్టింగ్ బెల్ట్, ప్లాస్టిక్ ఇటుకలు ప్రాజెక్టు ప్రథమ స్థానం పొందింది. విద్యార్థి వ్యక్తిగత విభాగంలో తెంబూరు జెడ్‌పిహెచ్ స్కూల్‌కు చెందిన జి.సాయి కిషోర్ నాయుడు ప్రదర్శించిన రివర్ క్లీనర్ ప్రథమ స్థానం పొందింది. దీనికి డి.శ్రీనివాసరావు గైడ్ టీచరుగా వ్యవహరించారు. గ్రూప్ విభాగంలో రొంపిలవలస జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థినులు ఎల్.చాందిని, ఎం.హర్షిని ప్రదర్శించిన సేఫ్టీ బ్యాంగిల్ ఫర్ ఉమెన్ అనే ప్రాజెక్టు ప్రథమ స్థానం పొందింది. విజేతలకు ఎంఇఒలు గోవిందరావు, తిరుమలరావులు బహుమతులను అందజేశారు.

ఇచ్ఛాపురం : స్థానిక మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మూడు విభాలుగా నిర్వహించారు. ప్రదర్శనకు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జెసాధయ్య, ఎంఇఒలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథ్, జిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎన్.విశ్వనాథం ప్రారంభించారు. ఈ పోటీల్లో వ్యక్తిగతంగా 22 మంది, గ్రూపుగా 27 ప్రాజెక్టులు ప్రదర్శించారు. వీటితోపాటు టీచర్ విభాగం నుంచి కూడా పాల్గొన్నారు. ఇందులో వ్యక్తిగత విభాగం నుంచి పురుషోత్తపురం ఎపి మోడల్ స్కూల్ విద్యార్థి పి.దీపక్‌కుమార్ విజేతగా గెలుపొందారు. గ్రూపు విభాగం నుంచి కొలిగాం జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులు ఆదిత్య మహారాణా, యశస్విని మహంతిని విజేతలుగా నిలిచారు. ఉపాధ్యాయ విభాగం నుంచి లొద్దపుట్టి జెడ్‌పిహెచ్ఎస్ ఉపాధ్యాయులు ఎస్.వాహిని విజేతగా నిలిచారు. వీరు జనవరి 3న నిర్వహించనున్న జిల్లాస్థాయి పోటీలకు పాల్గొంటారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.

టెక్కలి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి విలియమ్స్ ప్రారంభించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి 32 ప్రాజెక్టులు ప్రదర్శనలో ఉంచారు. వీటిలో బూరగాం ఉన్నత పాఠశాల విద్యార్థులు దారపు హసిని ప్రదర్శించిన సోలార్ పవర్ ఇరిగేషన్ ప్రదర్శన మొదటి బహుమతిని సంపాదించుకుంది. సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కర్రి రోషిత్, పప్పు నాగచైతన్యలు ప్రదర్శించిన ఎయిర్ పరిఫైర్ ప్రాజెక్టు ద్వితీయ స్థానం సాధించింది. లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులు ఊన సూర్యప్రకాష్ తయారు చేసిన ఎర్త్ క్యాక్ ఆలెర్టు ప్రాజెక్టుకు మూడో బహుమతిగా ఎంపికైంది. ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, డి.నాగభూషణం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కిరన్‌కుమారి పర్యవేక్షించారు. న్యాయ నిర్ణేతలుగా కళాశాలకు చెందిన అధ్యాపకులు సంధ్యారాణి, కె.శ్రీనివాసరావులు వ్యవహరించారు.

పలాస : విద్యార్థుల మేధాశక్తిని వెలికితీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్శింహమూర్తి, ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు, సత్యంలు అన్నారు. సౌత్ ఇండియా ఫెస్టివల్లో భాగంగా పలాస ప్రభుత్వ హైస్కూల్‌లో మండలస్థాయి పాఠశాలల సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌కు వ్యక్తిగత ప్రాజెక్టులు 17, గ్రూప్ ప్రాజెక్టులు రెండు, ఉపాధ్యాయ ప్రాజెక్టులు రెండు ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టుల్లో వ్యక్తిగత విభాగంలో పలాస హైస్కూల్ 9వ తరగతి చదువుతున్న విద్యార్థి జస్వంత్ పాత్రో విజేతగా నిలవగా, గ్రూపు విభాగంలో చిన్నబాడాం హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు టి.భరత్‌కుమార్, బి.ప్రవల్లిక, ఎం.అక్షిత విజేతలుగా నిలిచారు. ఉపాధ్యాయుల విభాగంలో కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎల్.నీలాచలం ప్రదర్శించిన ప్రాజెక్టు విజేతగా ఎంపికైంది. న్యాయ నిర్ణేతలుగా పలాస జూనియర్ కళాశాల అధ్యాపకులు హనుమంతు బిజ్జి, యుగంధర్ వ్యవహ రించారు. పలాస హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.దశరథి పాల్గొన్నారు.



కవిటి : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఇఒలు



పొందూరు : ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఇఒ రాజారావు

కంచిలి: కంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమవారం నిర్వహించిన మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులచే ప్రదర్శించబడిన సైన్స్ ప్రాజెక్టు ఆకట్టుకున్నాయి. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి 80 ప్రాజెక్టులు విద్యార్థులు ప్రదర్శించారు వ్యక్తిగత సమూహ ఉపాధ్యాయ విభాగాల్లో ఈ ప్రాజెక్టుల ప్రదర్శన చేపట్టారు. పర్యావరణ కాలుష్య కారకమైన ఇంధన వనరులను వినియోగించకుండా కాలుష్య రహిత వస్తువుల వినియోగంపై పలు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఎంఇఒ ఎస్.శివరాంప్రసాద్, కంచిలి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొందూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో మొదటిస్థానం పొందిన పాఠశాలలు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేయబడ్డాయన్నారు. మండలస్థాయి గ్రూప్ విభాగంలో లోలుగు జెడ్‌పి ఉన్నత పాఠశాల మొదటిస్థానం, తోలాపి ద్వితీయస్థానంలో నిలవగా వ్యక్తిగత విభాగంలో లోలుగు కెజిబివి విద్యార్థి జి.అంజలి మొదటిస్థానం సాధించి జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. కార్యక్రమంలో ఎంఇఒ పి.రాజారావు, ఎగ్జిబిషన్ న్యాయనిర్ణేతలుగా వి.మంజూష, ఎస్.లీలావతిలు వ్యవహరించారు.

హడావుడిగా అరసవల్లి టెండర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ నిర్వహణకు అవసరమైన కొనుగోళ్లు, కొబ్బరి, తలనీలాలు, రంగులద్దే కార్యక్రమాలకు ఆలయ అధికారులు హడావుడిగా సోమవారం టెండరు వేలం నిర్వహించారు. రాష్ట్ర పండగగా ప్రభుత్వం నిర్వహిస్తున్న రథసప్తమి వేడుకలకు ముందే ఈ టెండరింగ్ జరగడం వ్యాపారుల్లో ఆసక్తి నెలకొంది. దీనికి తోడు ఇటీవలే ప్రసాద్ పథకం ద్వారా రూ.100కోట్లు తీసుకొస్తానని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించడంతో ఆలయ నిర్వహణపై వ్యాపారుల్లో ఆసక్తి పెరిగింది. అందులో భాగంగా మునుపెన్నడూ లేనంతగా ఈసారి టెండరు ప్రక్రియ కొనసాగింది. అయితే టెండర్లు నిర్వహించే సమయంలో టిడిపి ద్వితీయ శ్రేణి నాయకులను పక్కన కూర్చోబెట్టుకుని ఆలయ ఇఒ భద్రాజీ టెండరు ప్రక్రియ నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

శ్రీకాకుళం అర్బన్

పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా కోర్టు పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించారు. కోర్టు ఆవరణలో గల ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా న్యాయసాధికారిత సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి, సిహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ పరామర్శ

కవిటి: ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సోమవారం పరామ ర్శించారు. మండలంలోని చండిపుట్టుగ, కమలాయిపుట్టుగ, జాడుపూడి ఆర్.ఎస్, బెలగాం, పెద్దశ్రీరాంపురం, బల్లిపుట్టుగ, ముత్యాలపేట, రామయ్య పుట్టుగ గ్రామాల్లో ఇటీవల పలువురు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలి

పలాస : అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎ.దిలీప్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస ఆర్‌టిసి డిపో వద్ద సోమవారం భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎం.అప్పలరాజు, కార్మికులు పాల్గొన్నారు.

తిరుమలరావుకు సన్మానం

కొత్తూరు: మండలంలోని కడుం ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ... వర్క్ ఎడ్జెస్ట్ మెంట్‌పై పాతపొన్నుటూరు యుపి పాఠశాలలో సాంఘిక శాస్త్రోపాధ్యాయునిగా పనిచేస్తున్న జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ రాష్ట్రపతి పురస్కార గ్రహీత కుదమ తిరుమలరావును విజయనగరం జిల్లా బొబ్బిలి రోటరీ క్లబ్ ఆదివారం ఘనంగా సన్మానించారు. రోటరీక్లబ్, కారుణ్య ఫౌండేషన్‌లు సంయుక్తంగా బొబ్బిలి రోటరీ కార్యాలయంలో నిర్వహించిన సాహిత్య సమావేశంలో ఆయన ఈ గౌరవాన్ని పొందారు. విజయవాడలో ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభల నిర్వహణ నేపథ్యాన్ని పురస్కరించుకొని ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలి

పర్లాకిమిడి: ఇటీవల కురిసన వర్షాలకు రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రొక్కం లోకనాథం ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కాశీనగర్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ సుధీర్‌కుమార్ నందను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ గిడ్డంగులను ఏర్పాటు చేయాలన్నారు. కౌలుదారు రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. 200 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిడిగాం పంచాయతీశాఖ అధ్యక్షులు పనస వెంకటరమణ, గోరిబంద పంచాయతీ అధ్యక్షులు యర్నాగుల లక్ష్మీనారాయణ, కార్యదర్శి రేవల్ల బాబురావు, సభ్యులు లోకేష్, శివాల మిన్నారావు, యర్నాగుల ప్రసాద్, బోడాల రవణ, యర్నాగుల సోమేష్, గంగుల వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఆవిష్కార్' శిక్షణ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

జాతీయ స్థాయిలో ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆవిష్కార్ సీజన్-2 హేక్‌ఆన్ సోమవారం ముగిసింది. 19 రాష్ట్రాల నుండి 51 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 186 మంది విద్యార్థులు పాల్గొని 48 గంటల పాటు వివిధ సమస్యలకు పరిష్కారాలు చూపారు. ఇంజినీర్ల మేథోమథనంలో 220 టీమ్‌లను గుర్తించి అందులో 51 టీంలకు అవకాశం కల్పించారు. వీటిలో 10 టీమ్‌లను గుర్తించి అందులో మూడింటిని ఎంపిక చేశారు. ఆక్వానీటి యంత్రం ద్వారా అందులో నీటిని సేకరించే ఐడియాతో వచ్చిన ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ కోయంబత్తూరు మొదటి బహుమతిగా రూ.1.25 లక్షలు సాధించింది. రిజర్వేషన్ టిక్కెట్లను తిరిగి అమ్ముకొనే ఐడియాతో వచ్చిన మహారాజా కాలేజ్ ఆఫ్ విజయనగరం రెండో బహుమతిని సాధించి రూ.లక్ష కైవశం చేసుకుంది. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు ఉపయోగించి బోధన, పరీక్షా విధానంలో మార్పు గురించి తెలియజేసిన ఎసి పటేల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ముంబై మూడో బహుమతి సాధించి రూ.75 వేల నగదును చేజిక్కించుకుంది. వీటితో పాటు ఐతమ్, ఎసిఎస్ఐటి సూరత్ కళాశాలలు కన్సోలేషన్ బహుమతులను సాధించారు. న్యాయనిర్ణేతలు క్వాలివాన్ టెక్నాలజీస్ సిఇఒ సందీప్ బత్తుల, సీనియర్ ఎనలిస్ట్ సుస్మా బడగర్వాలా వ్యవహరించారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్లు డాక్టర్ జి.సతీష్‌కుమార్, డాక్టర్ ఎం.వి.ఎన్.కుమార్, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ జె.సురేష్‌కుమార్, గిరీష్ కుమార్, విద్యార్థి కన్వీనర్లు సాయిశ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రశ్నాపత్రం విడుదల చేస్తున్న గణపతిరావు

ప్రతిభా పరీక్షకు స్పందన

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేందుకు మండలంలోని కొత్తపేట ప్రాథమికోన్న పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రతిభా పరీక్షకు స్పందన లభించింది. విద్యా కమిటీ చైర్మన్ గీత గణపతిరావు ఆధ్వర్యాన ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. ఈ పరీక్షల్లో మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 3 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు 142 మంది పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రిపబ్లిక్ డే రోజున నగదు బహుమతితో పాటు షీల్డు, ప్రశంసాపత్రం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు చింత ఉమారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సర్పంచ్ రాములమ్మతో మాట్లాడుతున్న తిలక్

మంత్రి ప్రోద్బలంతోనే దాడులు

సంతబొమ్మాళి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ ప్రథమ పౌరులు సర్పంచ్‌కే లేకుండాపోయిందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో సర్పంచ్ జోగి రాములమ్మకు చెందిన 180 పీకేసి కొబ్బరి మొక్కలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి నాయకుల దాడులతో తన గ్రామంలో సర్పంచ్‌గా జీవించడానికి ఎంత కష్టంగా మారిందో తెలుస్తుందని అన్నారు. తీర ప్రాంత మత్స్యకారులకు తంపర భూములు జీవనోపాధిని కల్పించేవిగా తరతరాలుగా వస్తున్నాయని అన్నారు. అలాంటి భూముల్లో సాగు చేసిన మొక్కలను దౌర్జన్యంగా తొలగించి వారి జీవనోపాధిపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మంత్రి అచ్చెన్నాయుడు ప్రోద్బలంతో స్థానిక టిడిపి నాయకుడు, మాజీ సర్పంచ్ పుక్కళ్ల శ్రీనివాసరావు దాడులు చేయడానికి రెచ్చిపోతున్నారని విమర్శించారు. సర్పంచ్ రాములమ్మను చంపేస్తానంటూ శ్రీనివాసరావు బెదిరించడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, సర్పంచ్ జోగి రాములమ్మ, వైసిపి జిల్లా బిసి అధ్యక్షుడు బుడ్డా మోహన్‌రెడ్డి, మార్పు నాగభూషణరావు, ఆట్ల రాహుల్, పుక్కళ్ల లక్ష్మణరావు, లండ రామారావు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ న్యాయవాది వి.వి శేషాద్రిపై సివిల్ కేసు విచారణ పేరుతో పోలీసులు విచారణకు పిలిచి అసభ్య పదజాలంతో మాట్లాడి మానసిక క్షోభకు గురిచేశారని, దీంతో తీవ్ర ఆవేదనకు గురైన ఆయన స్టేషన్‌లోనే మృతి చెందడం పోలీసుల దాష్టీకానికి పరాకాష్టని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిలారి ఈశ్వరరావు ఆరోపించారు. తక్షణమే బాధ్యులైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరశిస్తూ న్యాయవాదులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యాగళ్ల ప్రసన్న కుమార్, న్యాయవాదులు కంచరాన నాగభూషణరావు, ఎన్ని సూర్యారావు, నౌపాడ విజయ్ కుమార్, కొంక్యాన సుభాష్, బగాది రామ్మోహనరావు, పుప్పాల రంగబాబు, ఖస్పా ప్రతాప్ చంద్ర, ఆరికితోట కృష్ణరాజు, ఆగూరు ఉమామహేశ్వరరావు, మద్దుల మూర్తి, గేదెల ఇందిరాప్రసాద్, దవల విజయలక్ష్మి, కొప్పిశెట్టి ఉషారాణి, పైడి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు



ఆమదాలవలస : నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఆమదాలవలస: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి భాయి ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సాదు ధనుంజయరావు, తమ్మినేని అన్నం నాయుడు, బొడ్డేపల్లి మోహనరావు, గురుగుబెల్లి ప్రభాకరరావు, వాడవలస రాజేశ్వరరావు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయులు రూపొందించిన 'హిందీ పోరం' కేలండర్‌ను జెసి తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. జిల్లాలోని పాఠశాలల్లో హిందీ చదువుతున్న విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ, భాషను మాట్లాడేవారి సంఖ్య తక్కువగా ఉందని ఆయన అన్నారు. ఈ పరిస్థితిని మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, ఫోరం ప్రతినిధులు ఐ.సంతోష్ కుమార్, శ్రీనివాసరావు, ఎస్.జగన్నాథరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డైరీ..

రాష్ట్ర ప్రభుత్వ టైపిస్టులు అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నూతన సంవత్సర వార్షిక డైరీతో పాటు కేలండర్‌ను సోమవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సంఘం అధ్యక్షులు పి.మణి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి లాడి వెంకటరామన్, సంఘం నాయకులు వెంకటరావు హాజరయ్యారు.

కూలిన కల్వర్టు శ్లాబ్ పరిశీలన

వజ్రపుకొత్తూరు: వంశధార సాగునీరు కాలువపై నిర్మించిన కల్వర్టు శ్లాబ్ ఇటీవల కూలిపోయింది. దీనిని వంశధార నీటి డిస్ట్రిబ్యూట్ వజ్రపుకొత్తూరు కమిటీ అధ్యక్షులు గొనప నిరంజన్ సోమవారం పరిశీలించారు. నగరంపల్లి నీటి వినియోగదారుల సంఘం, పెదబాడం ఆయకట్టులో భాగంగా 50 ఏళ్ల క్రితం కందిబంద వంశధార సాగునీరు వచ్చే కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టారని అన్నారు. అది ఇటీవల కూలిపోవడంతో పొలాల నుంచి రాకపోకలకు రైతులకు అంతరాయం కలిగిందన్నారు. రోడ్డుని దృష్టిలో పెట్టుకుని ఈ సమస్యను పరిశీలించి వంతెన పునరుద్దరణ చేయాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. రైతులు శంకర్, దివాకర్, తిరుపతి, ఢిల్లీ, మాజీ సర్పంచ్ గిరిబాబు, నీటి సంఘం అధ్యక్షులు దువ్వాడ అప్పారావు పాల్గొన్నారు.



సోంపేట కళాకారులు

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో సోంపేట కళాకారులు

ప్రజాశక్తి - సోంపేట

సోంపేట పట్టణానికి చెందిన నటరాజ నాట్యమండలికి చెందిన కళాకారులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు. కేరళలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఇటీవల మృదంగ నాదం పేరిట 11,600 మంది కళాకారులు ఒకేసారి ప్రదర్శన ఇచ్చి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్స్‌లో చోటు సంపాదించారు. ఈ ప్రదర్శనలో సోంపేటకు చెందిన వాసుదేవా, స్వాతి, శ్రీలక్ష్మి, ఆశ్రిత, స్నేహ, లాస్య, దర్శితాలతో పాటు పలాసకు చెందిన కళాకారులు పాల్గొన్నారని నాట్యమండలి నిర్వాహకులు బిందు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులకు స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దలు తమ అభినందనలు తెలియజేశారు.



మాట్లాడుతున్న వెంకటాచలం

హక్కులపై అవగాహన అవసరం

టెక్కలి : సమాజంలోని వ్యక్తులను విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించుకోవాలని వినియోగదారుల సంఘ రాష్ట్ర నాయకులు, జిల్లా సంఘ క్లబ్ మాస్టర్ ఎల్.వెంకటాచలం అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం వాణిజ్య విభాగంశాఖ ఆధ్వర్యాన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరుగుతున్న తరుణంలో వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనంతరం అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముందుగా ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, రామారావు, హేమరాజ్, లోకేశ్వరరావు, మల్లేశ్వరరావు, తేజోవతి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ చేయూత

పొందూరు: మండలంలోని కోటిపల్లిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు పొందూరు లయన్స్ క్లబ్ చేయూతనందించింది. బాధిత నాలుగు కుటుంబాలకు రూ.10 వేలు నగదు, 20 కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిదులు డాక్టర్ మల్లిబాబు, కళ్యాణి, ధర్మారావు, బాడాన శేషగిరి నాయుడు, శ్రీనివాసరావు, చక్రపాణి, సూర్యనారాయణ, ఆదినారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.